**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**జాతీయ వార్తలు**

తేదీ: 02-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశం 2047వ సంవత్సరానికి ముందే అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ అన్నారు.
- ఉగ్రవాదం నుండి తనను రక్షించుకునే హక్కును భారతదేశం వినియోగించుకుంటుందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు.
- భారతదేశంలో తొలి బుల్లెట్ రైలు వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి సిద్ధంగా ఉంటుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.
- అంతర్జాతీయ ఆరోగ్య సంస్థకు ఔషధ భద్రతా పర్యవేక్షణ సహకారం అందించడంలో ప్రపంచంలో భారత్ 8వ స్థానంలో ఉందని కేంద్ర మంత్రి జె.పి.నడ్డా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 2047వ సంవత్సరానికి ముందే అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ అన్నారు. చెన్నైలోని డాక్టర్ ఎంజిఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ విశ్వవిద్యాలయంలో ఈరోజు ఆయన స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. భారతదేశం త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అన్నారు. విశ్వవిద్యాలయ విద్య తర్వాత కూడా విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు కాలానికి అనుగుణంగా మారాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదం నుండి తనను రక్షించుకునే హక్కును భారతదేశం వినియోగించుకుంటుందని, భారత రక్షణను ఎలా ఉపయోగించుకోవాలో ఎవరూ నిర్దేశించలేరని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. చెన్నైలో ఈరోజు జరిగిన శాస్త్ర 2026- ఐఐటి మద్రాస్ టెక్నో-ఎంటర్టైన్మెంట్ ఫెస్ట్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశం తనను తాను రక్షించుకోవడానికి అన్నివిధాలా సిద్ధంగా ఉంటుందని అన్నారు. నిరంతర సరిహద్దు ఉగ్రవాదం సద్భావనను దెబ్బతీస్తుందని తెలిపారు. భారత విదేశాంగ విధానం ప్రపంచాన్ని ఒక కుటుంబంగా చూస్తుందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్…33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో తొలి బుల్లెట్ రైలు వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి సిద్ధంగా ఉంటుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఈరోజు జరిగిన హై-స్పీడ్ టన్నెల్ పురోగతి కార్యక్రమంలో ఆయన దృశ్య మాధ్యమ విధానంలో మాట్లాడారు. పాల్ఘర్‌లో విరార్ - బోయిసర్‌లను కలిపే దాదాపు 1.5 కిలోమీటర్ల సొరంగం పురోగతి ముంబై - అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ లో ఒక ప్రధాన మైలురాయని అన్నారు. 508 కిలోమీటర్ల పొడవైన హై-స్పీడ్ రైలు కారిడార్‌లో మొత్తం 12 స్టేషన్లు ఉంటాయని స్పష్టం చేశారు. బుల్లెట్ రైలు కారిడార్ దశలవారీగా ప్రారంభించబడుతుందని, మొదటి హై-స్పీడ్ రైలు సూరత్-బిలిమోరా మార్గంలో నడుస్తుందని

తెలిపారు. బుల్లెట్ రైలు మధ్యతరగతికి సరసమైన, సౌకర్యవంతమైన రవాణా మార్గంగా ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు న్యూఢిల్లీలో బుద్ధునికి సంబంధించిన పవిత్ర పిప్రాహ్వా అవశేషాల అంతర్జాతీయ ప్రదర్శనను ప్రారంభించనున్నారు. ఈ ప్రదర్శన న్యూఢిల్లీలోని రాయ్ పిథోరా సాంస్కృతిక సముదాయంలో జరుగుతుంది. వందేళ్ల తర్వాత స్వదేశానికి తీసుకురాబడిన పిప్రాహ్వా అవశేషాలను, న్యూఢిల్లీలోని నేషనల్ మ్యూజియం, కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంలలో భద్రపరచబడిన పిప్రాహ్వా నిజమైన అవశేషాలతో కలిపి ప్రదర్శనకు ఉంచుతారు. 1898లో కనుగొనబడిన పిప్రాహ్వా అవశేషాలు ప్రారంభ బౌద్ధమత పురావస్తు అధ్యయనంలో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయని ప్రధానమంత్రి కార్యాలయం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ఎలక్ట్రానిక్స్ భాగాల తయారీ పథకం మూడవ విడత కింద 22 కొత్త ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. దీనికి 41 వేల 863 కోట్ల రూపాయల పెట్టుబడిని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలలో మొబైల్ తయారీ, టెలికాం, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, ఐటి హార్డ్‌వేర్‌తో సహా 11 లక్ష్య-విభాగ ఉత్పత్తుల తయారీ విభాగాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు 2 లక్షల 58 వేల కోట్ల రూపాయల విలువైన ఉత్పత్తిని సాధిస్తాయని, దాదాపు 34 వేల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తాయని భావిస్తున్నారు. ఇదే విషయమై కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో ఈరోజు మాట్లాడుతూ... ప్రధాన సంస్కరణల అమలును వేగవంతం చేయడం కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ ఆరోగ్య సంస్థకు ఔషధ భద్రతా పర్యవేక్షణ సహకారం అందించడంలో ప్రపంచంలో భారత్ 8వ స్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జె.పి.నడ్డా వెల్లడించారు. భారతదేశ అధికారిక ఔషధ ప్రమాణాల పుస్తకం ఇండియన్ ఫార్మకోపియా- 2026 10వ ఎడిషన్‌ను న్యూఢిల్లీలో ఈరోజు మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా విడుదల చేసిన నివేదికలో మొదటిసారిగా 20 రక్త భాగాల లోతైన విశ్లేషణ అధ్యయనాలు చేర్చడంతో రక్తహీనతపై అధ్యయనం, పరిశోధనలను విస్తరించడానికి సహాయపడుతుందని పేర్కొంటూ...

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

మన్నతు పద్మనాభన్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనకు ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. గౌరవం, సమానత్వం, సామాజిక సంస్కరణల్లో నిజమైన పురోగతి ఉంటుందని నమ్మిన దార్శనికుడు పద్మనాభన్ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత వంటి రంగాలలో పద్మనాభన్ చేసిన కృషి చాలా ప్రేరణాత్మకమైనదని నరేంద్రమోదీ అన్నారు. కేరళలో సమాజంలోని అత్యున్నత విలువలను బలోపేతం చేయడానికి మన్నతు పద్మనాభన్ తనను తాను అంకితం చేసుకున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

రైతుల ఆదాయాన్ని పెంచడం కేంద్ర ప్రభుత్వ కీలక ప్రాధాన్యత అని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. మహారాష్ట్ర నాసిక్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశామని అన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలు కొనసాగిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్-ప్రగతి లక్ష్యమని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ అన్నారు. న్యూఢిల్లీలో ప్రగతి 50వ సమావేశం సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రధాన వేదిక అయిన ఈ వ్యవస్థ పదేళ్లుగా అమలులో ఉందని తెలిపారు. నిర్దిష్ట ప్రాజెక్టులు, పథకాలలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రధానమంత్రి నేరుగా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులతో ప్రగతి సమీక్ష సమావేశాలకు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85,259 పాయింట్ల వద్ద ప్రారంభమై ఇంట్రాడేలో 85,812 వద్ద గరిష్ఠాన్ని తాకి... చివరికి 573.41 పాయింట్ల లాభంతో 85,762 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 26,340 వద్ద గరిష్ఠాన్ని తాకి.. చివరికి 182 పాయింట్ల లాభంతో 26,328 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =